# పెట్రోలు దొంగ

## — ఆనంద్



ఈ మధ్య అడపాదడపా నా స్కూటర్ నుండి ఎవరో పెట్రోలు దొంగిలిస్తున్నట్లు అనుమానంగా వుంది నాకు. పెట్రోలు ధర ఆకాశాన్నంటే ఈ రోజుల్లో పెట్రోలు దొంగతనమంటే, చూడండి యెంత కష్టమో!

అయితే దొంగతనం విచిత్రంగా జరుగుతున్నట్లుగా వుంది. రోజూ మా యింట్లో ఆరుబయటే పార్కు చేసివున్న స్కూటరులోంచి దొంగతనం జరగట్లేదు. తరచూ మా ఫ్రెండు ప్రకాష్ యింటికి వెళ్ళినపుడు రోడ్డు మీద పార్కుచేసి వున్న బండిలో నుండి దొంగ తనం జరుగుతోందని నా అనుమానం.

నెల రోజుల క్రితం ప్రకాష్ యింటికి వెళ్ళినపుడు మొదటిసారి అనుమానం వచ్చింది నాకు. ఆ రోజు రాత్రి బాగా పొద్దుపోయాక వాళ్ళింటికి వెళ్ళాను యేదో పనుండి. ఇక యింటికి వెడదామని బయటికి వస్తే నా స్కూటరు దగ్గర్నుండి వో కుర్రవాడు గబగబా వెళ్లిపోతుండడం చూసాను. స్కూటరు స్టాండు తీస్తుంటే, వెనుక చక్రం దగ్గరగా రోడ్డుమీద తడిగా వుండడం గమనించాను. అనుమానంగా చూస్తే పెట్రోలు టాంకు దగ్గర కొద్దిగా ఆయిల్ మరకలున్నాయి. అంతకు రెండు గంటల ముందే ఐదు లీటర్ల పెట్రోలు పోయించాను, దొరకడం కష్టంగా వుంటోందని. గుండె గుభేలుమంది. పెట్రోలు బాగా పోయిందేమోనని, టాంకుమీద మూత తీసి చూసాను. అంతగా వెలితి కన్పించలేదు. అంటే దొంగతనం జరుగబోతుంటే, మేము బయటికి వచ్చివుండాలి. దొంగ ఆదరాబాదరాగా పారిపోవడంతో రోడ్డుమీద పెట్రోలు వలికి వుంటుంది. చీకట్లో, యెవరికీ కన్పించదన్న ధీమాతో ప్రయత్నించి వుంటాడా దొంగ. పరీక్షించి చూస్తే స్కూటరు వెనుక చక్రం దగ్గర స్కూటరు మీద కూడా తడిగా వుంది. లేచిన వేళ బాగుండి దొంగ తనం జరుగకుండా తప్పిందని ఆనందిస్తూ యిల్లు చేరాను.

ఈ సంఘటన జరిగిన నాల్గు రోజుల తర్వాత మళ్ళీ ప్రకాష్ యింటికి వెళ్ళడం తటస్థించింది. రోజూ ఆఫీసు నుండి యిల్లు చేరేసరికి రాత్రి యేడున్నర అయిపోతుండడం వల్ల, ఎవరింటికి వెళ్ళినా రాత్రి యెనిమిది గంటల తర్వాతే. ఆ రోజూ అంతే. స్కూటరు తీస్తుంటే మళ్ళీ వెనుక చక్రం దగ్గరగా రోడ్డుమీద కనీకన్పించ కుండా తడి. అంటే ఈసారి దొంగతనం జరిగి చాలాసేపే అయిందనుకున్నాను. నాకు ఆశ్చర్యం కూడా కలిగింది. వాళ్ళింటి దగ్గరే యెందుకలా అవుతోందని! పోనీ పిల్లలెవరయినా ఆకతాయి తనంగా చేస్తున్నారా అంటే, మా పిల్లలూ వాళ్ళ పిల్లలూ కూడా యింట్లోనే ఆడుకుంటున్నారు. ఈసారి దొంగని యెలాగయినా పట్టుకోవాలనుకున్నాను.

రెండ్రోజుల తర్వాత వాళ్ళింటికి వెళ్ళినపుడు గుర్తుంచుకుని, గుమ్మం దగ్గరగా లోపలే కూర్చుని కాపలా కాసాను. ఆ రోజు యెవరూ స్కూటరు దగ్గరికి రాలేదు. నన్ను గమనించి వుంటారేమో రాలేదనుకున్నాను. మర్నాడు వెళ్ళినపుడు కూడా కాపలా కాసాను. ఆ రోజూ ఎవరూ రాలేదు. మళ్ళీ రెండు మూడు రోజులు ఏ దొంగతనం కాలేదు. దొంగ భయపడ్డాడని మేమంతా నిర్ధారించుకున్నాం.

కానీ నేనున్నానంటూ దొంగ మాకు గుర్తు చేస్తూ మళ్ళీ మొన్న రాత్రి అవే చిహ్నాలు. రోడ్డు మీద, వెనుక చక్రంమీద తడి. నాకు పంతం పెరిగింది. ఈసారి యిలా కాదని, నిన్న రాత్రి ప్రకాష్ యింటికి వెళ్ళినపుడు, ముందుగది తలుపువేసి, లోపలి లైటు ఆర్పేసి, కిటికీ తలుపులు వారగా తెరచి, అందరం అక్కడే నిలబడి రోడ్డువేపు చూస్తున్నాం. నెమ్మదిగా గుసగుసలాడుతూ, వో అయిదు నిమిషాల తర్వాత సందు చివర పాకలో వుంటున్న వాళ్ళబ్బాయి పదేళ్ళవాడు వకడు అటు వేపు వచ్చాడు. స్కూటరు దగ్గరికి రాగానే నెమ్మదిగా ఆగాడు. చేతిలో చిన్న కారియరు. అటూ యిటూ చూసాడు. మేమున్న గది తలుపువేపు మరీ దీక్షగా చూసాడు. "హమ్మయ్య! దొంగ దొరికాడు. పట్టుకుందాం" అని నేను లేస్తుంటే ప్రకాష్ ఆపాడు. "కొంచెం ఆగు. వాడు పెట్రోలు తీస్తుండగా పట్టుకుంటే మనకు ఆధారంతో సహా పట్టుబడతాడు. మనం దెబ్బలాడడానికి సాక్ష్యంగా వుంటుంది" అంటూ.

ఓ నిమిషం అలాగే నిలబడి, ఆ కుర్రాడు కారియరు వెనుక చక్రం దగ్గరగా క్రింద పెట్టాడు. నాలో రక్తం ఉడుకులెత్తసాగింది. ఎంత ధైర్యం వాడికి అనుకున్నాను. మళ్ళీ యింకోసారి మా యింటివైపు చూసి, స్టాండు వేసి వున్న స్కూటరు యెక్కి సీటుమీద కూర్చున్నాడు. హాండిల్ బారుని రెండు చేతుల్తో పట్టుకుని అటూ యిటూ కదలుస్తూ, హారన్ కొట్టినట్లు నెమ్మదిగా పీపీ! అంటూ, స్కూటరు డ్రయివు చేస్తున్నట్లు అభినయించసాగాడు. అతడి ముఖంలో చెప్పలేని తృప్తి. యెనలేని మహదానందం, ప్రపంచాన్నంతా జయించినట్లు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు ఆనందపడిపోతున్నాడా పసివాడు. ఇది చూసిన మాకు వో క్షణం యేమీ తోచలేదు. కాసేపటి క్రితం దొంగగా నేను నిర్ధారణ చేసిన పిల్లవాడు, స్కూటరు యెక్కి కూర్చోవడమే మహద్భాగ్యంగా భావించడం, నిజంగా నా తొందరపాటుని వెక్కిరించినట్లయింది. అతడి మీద అభాండం వేసుంటే యెంతటి ఘోరం జరిగిపోయి వుండేదీ అనిపించింది. నా 'కుసంస్కారాని'కి నన్ను నేనే నిందించుకున్నాను.

ఇంతలో యెదురింటి తలుపు చప్పుడవడంతో ఆ కుర్రాడు స్కూటరు దిగి, కారియర్ పట్టుకుని గబగబా పరిగెత్తుకుని వెళ్ళిపోయాడు. మా అందరికీ నోట మాట రాలేదు. విపత్కర పరిస్థితి రాకుండా బయటపడ్డామని అనుకుంటూ దొంగని పట్టుకునే ప్రయత్నాన్ని తాత్కాలికంగా వాయిదా వేసి, గదిలో లైటు వేసాం. ప్రకాష్ భార్య ముందు గది తలుపు తీస్తూ యథాలాపంగా వీధివైపు చూసి, వున్నట్టుండి పొట్టచెక్కలయేలా నవ్వడం మొదలుపెట్టింది. ఏమయిందంటూ దగ్గరగా వెళ్ళిన ప్రకాష్ కూడా పడిపడి నవ్వసాగాడు. లోపల కుర్చీలో కూర్చుని వాళ్ళిద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తున్న నన్ను దగ్గరగా రమ్మని చేత్తో సైగ చేసాడు ప్రకాష్, అలా గట్టిగా నవ్వుతూనే. గుమ్మం దగ్గరికి వెళ్ళి చూద్దునుగదా! మతి పోయింది నాకు. నా స్కూటరు వెనుక చక్రం దగ్గరగా వో వూరకుక్క కాలు పైకెత్తి... రోడ్డుమీద తడి. నాకూ వకటే నవ్వు వచ్చింది. ఇంతమంది నవ్వులకి భయపడి కాబోలు అక్కడ నుండి పరిగెత్తిందా కుక్క... ఐ మీన్ నా పెట్రోలు దొంగ.